రేషన్ షాపులపై కూటమి గద్దలు!

గోపాలపట్నం మండలంలో రేషన్ దుకాణం నిర్వహించే డీలర్ వ్యక్తిగత కారణాలతో వేరే ప్రాంతానికి వెళ్లి పోయాడు. ఎండీయూ వాహనదారుడే ఇప్పటి వరకు డిపో నిర్వహణ బాధ్యత చూసుకుంటూ కార్డుదారులకు సరకులు అందజేస్తున్నాడు. ఇప్పుడు ఆ డిపోపై ఓ టీడీపీ నాయకుడి కన్ను పడింది. తనకు అనుకూలంగా ఉండే డీలర్‌కు ఇన్‌చార్జి పేరుతో డిపోను అప్పగించేలా పావులు కదిపాడు. ఇప్పుడు ఆ రెండు రేషన్ డిపోలకు టీడీపీ నాయకుడే బినామీగా వ్యవహరిస్తూ పేదలకు అందాల్సిన నిత్యావసరకులను పక్కదారి పట్టిస్తున్నారని ప్రచారం సాగుతోంది.

- విశాఖ విద్య

పెత్తనం చేసేందుకు నేతల స్కెచ్

పాతవారిని తొలగించి, అనుచరులకు కట్టబెట్టే ప్రయత్నాలు

బినామీలతో వినియోగదారులకు తప్పని ఇబ్బందులు



రేషన్ డిపోలో ఈకేవైసీ చేస్తున్న డీలర్



90వ వార్డు ఏపీఎస్‌ఈబీ కాలనీలో మూలకు చేరిన ఎండీయూ వాహనాలు

పశ్చిమ నియోజకవర్గంలో రేషన్ దుకాణాలపై కూటమి నేతలు గద్దల్లా వాలిపోతున్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ఇంటికే రేషన్ సరకులు పంపిణీ చేసేలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిని తొలగించేందుకు సిద్ధం చేస్తుండడంతో రేషన్ డిపోల్లో రాజ్యమేలేందుకు మళ్లీ కూటమి నాయకులు పావులు కదుపుతున్నారు. పేదలకు అందాల్సిన నిత్యావసర సరకులతో వ్యాపారానికి అలవాటు పడ్డ టీడీపీ నాయకులు ఇప్పటికే గోపాలపట్నం మండలంలో రెండు రేషన్ డిపోలను చేజిక్కించుకోగా, నియోజకవర్గంలోని మిగతా వోట్ల కూడా ఇదే రీతిన రేషన్ డిపోలను తమ కబంధ హస్తాల్లో పెట్టుకునేందుకు స్కెచ్ వేస్తున్నారు.

పాతవారిని తొలగించే కుట్రలు

పశ్చిమ నియోజకవర్గ పరిధి మర్రిపాలెం ఏరియాలో 30 రేషన్ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 17 ఎండీయూ వాహనాల ద్వారా సరకులు పంపిణీ చేస్తున్నారు. అదే విధంగా గోపాలపట్నం-1లో 22 షాపులు ఉండగా వీటి పరిధిలో 11 వాహనాలు, సింహాచలం ఏరియాలో 12 షాపులకు అనుబంధంగా 7 వాహనాలు, గవర కంచరపాలం పరిధిలో 5 డిపోలకు అనుబంధంగా రెండు వాహనాల ద్వారా సరకులు పంపిణీ చేస్తున్నారు. అలాగే చెంగల్రావుపేటలో 15 షాపులకు 6 వాహనాలు, జ్ఞానాపురంలో 11 షాపులకు 5 వాహనాలు, కంచరపాలెంలో 16 షాపులు ఉండగా, వీటి పరిధిలో 10 ఎండీయూ వాహనాల ద్వారా ప్రతీ నెలా రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్నారు. అయితే ప్రస్తుతం రేషన్ డీలర్ల పాత్ర కీలకంగా మారుతుండటంతో పాతవారిని తప్పించేలా కూటమి నేతలు కుట్రలు పన్నుతున్నారనే ప్రచారం సాగుతోంది.



కాకానినగర్‌లో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ పంపిణీ

కార్డుదారులకు కష్టాలు తప్పవా..?

కూటమి ప్రభుత్వ పాలనలో పేదోళ్లకు కష్టాలు మొదలయ్యాయి. రేషన్ కార్డు ఉంటే రూపాయి బియ్యం, ఇతర నిత్యావసర సరకులతో ఎలాగోలా బతికేయవచ్చనే ధీమా ఉండేది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లబ్ధిదారుల మనోధైర్యం క్రమేపీ సన్నగిల్లుతోంది. రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేసే నిత్యావసర సరకులకు ఇప్పటికే కోతపడింది. రేషన్ కార్డుదారులకు సవ్యంగా సరకులు అందడం లేదు. నాలుగు నెలలుగా కంది పప్పు సరఫరా చేయడం లేదు. దీంతో పాటు రేషన్ డిపోల్లో బినామీలు రంగ ప్రవేశం చేయడంతో సరకుల పంపిణీ మరింత అధ్వానంగా మారింది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే...

గోపాలపట్నం మండలంలో ఓ రేషన్ దుకాణ నిర్వాహకుడు వేరేచోటకు వెళ్లిపోవటంతో సమీప డిపో డీలర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాం. ఏదైనా డిపో ఖాళీ ఏర్పడితే, ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగానే భర్తీ చేస్తాం.ఇదంతా నిబంధనల మేరకే జరిగింది.

– లక్ష్మి, సివిల్ సప్లైఆర్ఐ, గోపాలపట్నం

క్లుప్తంగా

హైవేపై వాహనాల నిలిపివేత



ఎయిర్‌పోర్టు దారిలో నిలిపిన కార్లు

విశాఖ విద్య: ఎన్ఏడీ నుంచి ఎయిర్‌పోర్టుకు వెళ్లే జాతీయ రహదారిలో వాహనాలు గంటల తరబడి నిలుపుతున్నారు. ఎయిర్‌పోర్టుకు విమానాలు వచ్చే సమయంలో ప్రయాణికులను తీసుకెళ్లేందుకు ముందుగానే చేరుకుంటున్న వారు వాహనాలను జాతీయ రహదారిపైనే నిలిపివేస్తున్నారు. ఎయిర్‌పోర్టులో పార్కింగ్ ప్రదేశం ఉన్నప్పటికీ హైవేపైనే గంటల తరబడి నిలుపుతున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని అటుగా వెళ్లే వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి హైవేపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతానికి పూజలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

విశాఖ విద్య: పాకిస్తాన్‌పై వీరోచితంగా పోరాడుతున్న సైన్యానికి మద్దతుగా జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ సెంటర్‌లోని ప్రథమ ఉమామహేశ్వర కుమార స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి రమేష్ ఆధ్వర్యంలో ఆలయ పూజారి ఆకెళ్ల రామమూర్తి శర్మ పూజలు చేశారు. భారత ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతం కావాలని, సైనికులు, దేశ సరిహద్దు గ్రామాల ప్రజలు క్షేమంగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలోనాయకులు కిలపర్తి సత్యనారాయణ, మంజులు, జ్యోతి ,అశోక్, ఆదారి గణేష్ , సురేష్ పాల్గొన్నారు.

మల్కాపురం: భారతసైన్యం నిర్వహించిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని ములగాడ మండల బీజేపీ అధ్యక్షుడు లక్కరాజు రామకృష్ణ ఆధ్వర్యంలో జింక్ ఆంజనేయస్వామి ఆలయంలో, విజయ కనకదుర్గాదేవి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర దళిత మోర్చ ఉపాధ్యక్షుడు కొక్కిలిగడ్డ విజయబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిమేర శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో సతమతం

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీకాలనీలో తరచూ విద్యుత్ కోతల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. సమస్య పరిష్కరించాలని తెలుగు యువత నాయకుడు గుత్తుల మధుబాబు శనివారం విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ అచ్చిబాబును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఇటీవల కాలంలో ఏకేసీకాలనీలో అర్ధరాత్రి 12 నుంచి తెల్లవారుజాము 3 గంటల వరకు విద్యుత్ కోతలు విధిస్తున్నారని, దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

గోపాలపట్నం: రెండు కిలోల గంజాయిని గోపాలపట్నం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కరీంనగర్‌కు చెందిన వి. శ్రీకర్, వి. చందు గంజాయితీసుకు వస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు గోపాలపట్నం రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు చేశారు. వీరి నుంచి 2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. కాగా వీరు డుంబ్రిగూడకు చెందిన డుంబి అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసినట్టు గుర్తించారు. డుంబిని కూడా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

50శాతం రాయితీపై పశువుల దాణా

సింధియా: పశుసంవర్ధక శాఖ ద్వారా 50 శాతం రాయితీతో కూడిన పశువుల దాణా అందిస్తున్నామని.. పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని గాంధీగ్రామ్ పశువైద్యాధికారి డాక్టర్ సునీల్‌కుమార్ సూచించారు. పాడిరైతులు పశుదన్ యాప్‌లో నమోదు చేసుకుని ఉండాలని, పశువులకు టీకాలు కూడా వేయించడంతో నాటు తెల్లరేషన్ కార్డు కలిగి ఉండాలని సూచించారు. రైతుకు ఒక బ్యాగు మాత్రమే ఇస్తారని, 50 కేజీల దాణా ధర రూ.1100 కాగా 50 రాయితీ పోను రైతు రూ. 550 మాత్రమే చెల్లించాలని తెలిపారు. ఒక రైతుకు విడతల వారీగా 450 కిలోలు ఇవ్వనున్నట్టు చెప్పారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సునీల్‌కుమార్ సూచించారు.

కృష్ణాలయంలో లలితపారాయణ



లలిత పారాయణ చేస్తున్న చిన్నారులు, మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధిలోని కృష్ణాలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీవిజ్ఞాన మండలి యాదవ్ సంఘం ఆధ్వర్యంలో మహిళలు కృష్ణుడి ఉత్సవ విగ్రహానికి పాలు,పెరుగుతో అభిషేకాలు చేశారు.అనంతరం వారు లలిత పారాయణ,గోవింద నామాలను పఠించారు. వచ్చే శనివారం మందిరం వద్ద ప్రత్యేక పూజలు, శ్రీకృష్ణుని నామార్చన ,గోవింద నామాలు వంటి కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

రైల్వే సమస్యలపై ఆరా



సమస్య ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిరప్రసాద్ తదితరులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గవర కంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట ప్రాంతాల్లో కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎమ్మెల్యే గణబాబు శనివారం రైల్వే అధికారులతో కలసి పర్యటించారు. నూతనంగా ఏర్పాటు చేసే అదనపు రైల్వే ట్రాక్స్ ప్రతిపాదనలపై సమీక్షించారు. ట్రాక్ విస్తరణ ప్రతిపాదనలో ఆయా గ్రామాల్లో ఇళ్లు, రోడ్లు ఎంతవరకు ఎఫెక్ట్ అవుతాయో తెలుసుకున్నారు. నష్టపోయిన వారికి పరిహారం ఏ విధంగా నిర్ణయిస్తారో తెలియజేయాలని రైల్వే అధికారులను కోరారు. నష్టపోతున్న ప్రాంతాల ప్రజలతో మాట్లాడారు. కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెనను పరిశీలించారు. కార్యక్రమంలో జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రాము, గోపాలపట్నం, మహారాణిపేట తహసీల్దార్లు, ఆయా గ్రామాల అధ్యక్షులు పాల్గొన్నారు.

కేకే రాజుకు ఘన సత్కారం



కేకే రాజును సత్కరిస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు, ఇతర నాయకులు

సింధియా: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన కేకే రాజును శనివారం 40వ వార్డు కార్పొరేటర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో నిర్వహించిన కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు జన్మదిన వేడుకలకు హాజరైన కేకే రాజును శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. ముందుగా కేక్ కట్ చేసి నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపిన కేకే రాజు అనంతరం పార్టీ పురోగతి కోసం నాయకులతో చర్చించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, తిప్పల గురుమూర్తిరెడ్డి, నాయకులు గొలగాని శ్రీనివాసరావు, జీవీఎంసీ ఫోర్ల్ లీడర్ బానాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు బల్ల లక్ష్మణరావు, పీవీ సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



స్పోర్ట్స్ సెక్రటరీ ఉషను సత్కరిస్తున్న గణబాబు

గోపాలపట్నం: ఈస్ట్ కోస్టు రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ జగనరల్ సెక్రటరీగా ఎన్నికైన అంతర్జాతీయ బాక్సర్ ఎన్. ఉష శనివారం ఎమ్మెల్యే గణబాబును గోపాలపట్నంలోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెను ఘనంగా సత్కరించారు. క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించాలని సూచించారు.

'కిశోరి వికాసం'తో బాలికలకు భవిష్యత్తు



అంబేడ్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న ఏఎన్ఎం తార

విశాఖ విద్య: 'కిశోరి వికాసం' పథకం బాలికల బంగారు భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తుందని శాంతినగర్ సచివాలయ ఆరోగ్య కార్యదర్శి తార అన్నారు. జీవీఎంసీ 52వవార్డు అంబేడ్కర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తార మాట్లాడుతూ కిశోరి వికాసం పునఃప్రారంభం రాష్ట్రంలోని ప్రతి బాలిక భవిష్యత్తును మెరుగు పరచడానికి ఓ మంచి అవకాశమన్నారు. రుతు స్రావం - పరిశుభ్రత పద్ధతులను వివరించారు. ఐరన్ , విటమిన్-సి సమృద్ధిగా ఉన్న సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. తగినంత నిద్ర వల్ల మంచి ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్, కిశోరి బాలికలు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆ స్పర్శకు వందనం



తల్లుల కాళ్లను కడుగుతున్న చిన్నారులు

గోపాలపట్నం: చిట్టి చేతులు స్పృశించిన క్షణం ఆ తల్లుల కళ్లల్లో ఆనంద భాష్పాలు కనిపించాయి. లేత వేళ్లు పాదాలను కడుగుతున్న సమయంతో తల్లి మనసు తన్మయత్వానికి గురయింది. మనసు పులకించి పోయింది. భావోద్వేగానికి గురయింది. కళ్లలోనుంచి ఆనంద భాష్పాలు రాలాయి. మాతృమూర్తుల కాళ్లకు నమస్కారాలు చేస్తున్న చిన్నారులను గుండెలకు హత్తుకున్నారు. ఈ దృశ్యం జీవీఎంసీ 89వ వార్డు యల్లపువానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం దర్శనమిచ్చింది. ఇది చూసిన వారు సైతం ఉబ్బితబ్బిబ్బయ్యారు. తల్లి మనసు ఎంత గొప్పదో అంటూ మురిసిపోయారు. అంగన్‌వాడీ కేంద్రంలో తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వారి తల్లిదండ్రుల కాళ్లను కడిగి నమస్కరించారు. సూపర్‌వైజర్ జేటీఎస్ జ్యోతి మాట్లాడుతూ తల్లులు పిల్లల విషయంలో నిర్లక్ష్యంగా ఉండరాదని అన్నారు. పిల్లలు తల్లులను గౌరవించాలని అన్నారు. తల్లిదండ్రులపై ప్రేమను నింపేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్యకర్తలు దేవి, శాంతి, గాయత్రి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వీఆర్ఎస్ కార్మికుల బకాయిలు చెల్లించాలి

- గంగవరం పోర్టు ఎదుట కార్మికుల ఆందోళన

పెదగంట్యాడ: గంగవరం పోర్టు వీఆర్ఎస్ కార్మికుల బకాయిలను వెంటనే చెల్లించాలని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి కోరారు. బకాయిల కోసం గంగవరం పోర్టు కార్మికులు శనివారం పోర్టు ముట్టడికి ప్రయత్నించారు. వెంటనే హార్బర్ ఏసీపీ కాళిదాసు, సీఐ కామేశ్వరరావు ఆధ్వర్యంలో న్యూపోర్టు పోలీసులు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కార్మికుల ఆందోళనకు దేవన్‌రెడ్డి మద్దతు తెలిపారు.యాజమాన్యం స్పందించి కార్మికుల బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోర్టు యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఈ నెల 20న చర్చిస్తామని యాజమాన్యంతో చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ధర్మాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పూడ్చేస్తే ఎలా..?

సాక్షి ఎఫెక్ట్..



జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ దరి గణేష్ నగర్‌లో డ్రైనేజీలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఓ భవన నిర్మాణదారుడు డ్రైనేజీని పూడ్చేసేలా ఇసుక నిల్వ చేశారు. ఇసుక కుప్పల కారణంగా అటుగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి ఆక్రమణల వల్లే వర్షాలు కురిసేటప్పుడు డ్రైనేజీలు పొంగి రోడ్లపైకి మురుగు వస్తోందని ప్రజలు వాపోతున్నారు. జీవీఎంసీ అధికారులు ఇలాంటి ఆక్రమణలకు చెక్ పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- విశాఖ విద్య

హక్కుల రక్షణకే సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

ఉక్కునగరం: కార్మికుల హక్కుల రక్షణ కోసం ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌లో శనివారం నిర్వహించిన సీఐటీయూ ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీలో రూ. 1594 కోట్లు రావాల్సి ఉందన్నారు. వీటిని మూడు విడతలుగా చెల్లిస్తారన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు గత నెల రూ. 72 కోట్లు లాభం వచ్చిందన్నారు. గతంలో ప్లాంట్ ఆర్థిక పరిస్థితి బాగుంటే కార్మికులకు పూర్తి జీతాలు చెల్లిస్తామని చెప్పిన యాజమాన్యం నేడు చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. లేబర్ కోడ్స్ అమల్లోకి రాకముందే కేంద్ర ప్రభుత్వం ఆదేశాలతో స్టీల్ యాజమాన్యం వాటిని ఇక్కడ అమలు చేస్తుందన్నారు. యూనియన్ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ పూర్తి రామెటీరియల్ సమకూర్చిన తర్వాతే బీఎఫ్-3 ప్రారంభిస్తానని స్టీల్ కార్యదర్శి చెప్పారన్నారు. జూన్ నెలాఖరు వరకు రా మెటీరియల్ అందుబాటులో ఉండదని చెబుతున్న యాజమాన్యం జూన్ 10నే బీఎఫ్-3 ప్రారంభించడమేంటని ప్రశ్నించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకే సమ్మెలో పాల్గొంటున్నట్టు వెల్లడించారు. సమావేశంలో నాయకులు పి. శ్రీనివాసరాజు, బి. అప్పారావు, టి.వి. రాజు, మరిడయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో నిఘా కట్టుదిట్టం

ఉక్కునగరం: ఆపరేషన్స్ సిందూర్ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్‌లో నిఘా కట్టుదిట్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సీఐఎస్ఎఫ్ హెడ్ క్వార్టర్స్ దేశంలోని అన్ని యూనిట్లకు భద్రతకు సంబంధించి వివిధ చర్యలకు ఆదేశించింది. ఇందులో భాగంగా స్టీల్‌ప్లాంట్ పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ప్రారంభించారు. విధులకు వెళ్లే ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులతో పాటు అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తున్నారు. ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు సీఐఎస్ఎఫ్‌కు సహకరించాలని యూనిట్ కమాండెంట్ కోరారు.

మద్యానికి బానిసై యువకుడి బలవన్మరణం



మృతుడు ప్రవీణ్ (ఫైల్)

గోపాలపట్నం: మద్యానికి బానిసైన యువకుడు రెడ్డి ప్రవీణ్(27)బలవన్మరణానికి పాల్పడ్డాడు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గోపాలపట్నం నూకాలమ్మ ఆలయ సమీపంలోని విద్యానగర్‌లోతల్లి పార్వతితో కలిసి ప్రవీణ్ నివాసముంటున్నాడు. పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా మద్యం సేవిస్తూ పని కూడా వెళ్లడం లేదు. తల్లి ఇంట్లో లేని సమయంలో ఫ్యాను హుక్కుకు ఉరి వేసుకున్నాడు. బయట నుంచి వచ్చిన తల్లి తలుపు తెరవక పోవడంతో కిటికిలో నుంచి చూడగా వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చింది. వీరిది విజయనగరం జిల్లా వంగర మండలం కోతుల గూడ గ్రామం. తల్లి పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

'జిమ్'దా బాద్

వేసవి సెలవులు కావడంతో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన చిన్నారులు క్రీడామైదానాల్లో సందడి చేస్తున్నారు. ఓపెన్ జిమ్‌లకు వెళ్లి వ్యాయామాలు చేస్తూ ఉత్సాహంగా గడుపుతున్నారు. క్రీడా మైదానాల్లో క్రికెట్,టెన్నిస్ వంటి ఆటలు ఆడుతున్నారు. ఇందిరాకాలనీ,ములగాడ వంటి ప్రాంతాల్లోని ఓపెన్ జిమ్‌ల వద్ద కాలక్షేపం చేయడంతో పాటు సందడిగా ఆడుకుంటున్నారు. దీంతో ఓపెన్ జిమ్‌లు కళకళలాడుతున్నాయి. - మల్కాపురం

